ప్రజాశక్తి

ఆదివారం 1 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

పకడ్బందీగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు

- సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలి
- ఒంగోలు ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేయడంతో పాటు అర్హులకు అందేలా చూడాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ),ఏపీ 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ వివిధ ప్రాయోజిత కార్యక్రమాల అమలుపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో కలిసి అధికారులతో శనివారం సమీక్షించారు. సమావేశంలో జిల్లాలో అమలు జరుగుచున్న జాతీయ ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ కార్యక్రమం, పిఎం సూర్య ఘర్ పథకం, పిఎం గ్రామీణ సడక్ యోజన, పిఎం ఆవాస్ యోజన - టిడ్కో గహాల నిర్మాణం పథకాలలో పేదలకు గహాల మంజూరు, అమత్ 1, అమత్ 2 పథకాల ద్వారా ప్రజలకు తాగునీటి పథకాలు అమలు, స్వయం సహాయక బందాలలో ' లాక్ పతి దీదీ' లక్ష్యాలు, గ్రామాలలో నానో ▶ 3లో

కేంద్రం చేతిలో కీలుబొమ్మలుగా రాష్ట్ర పాలకులు

- మోడీని నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు

ప్రజాశక్తి -బాపట్ల

రాష్ట్ర పాలకులు కేంద్ర ప్రభుత్వం చేతిలో బొమ్మల్లా మారారని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రజలను మద్యం మత్తులో ముంచుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రథం బజార్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సభకు సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించమంటే మద్యం ధరలు తగ్గించామని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేర ఊదర గొట్టారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి ఐదునెలులు గడిచినా ఆ హామీ అమలు చేయలేదన్నారు. రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇవ్వకుండా అప్పుగా నిధులు ఇస్తే టిడిపి కూటమి ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలు సమస్యలు పక్కన పెట్టి సనాతన ధర్మం పేరుతో ప్రజలను పక్క దోవ పట్టిస్తున్నారన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి, దాని మిత్ర బృందాలు ప్రజలపై మోయలేని భారాలు మోపుతు న్నారన్నారు. త్యాగాలతో ▶ 3లో



ప్రమాదంలో దగ్ధమవుతున్న బస్సు

షార్ట్ సర్క్యూట్‌తో.. ప్రైవేటు నర్సింగ్ కళాశాల బస్సు దగ్ధం

మెయిన్ ▶ 5లో

ఏపీలో వ్యాపార అభివృద్ధికి అవకాశాలు: శిద్ధా సుధీర్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు

నూతన వ్యాపార విధానం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అభివృద్ధికి అవకాశాలు వున్నాయని, ఇందుకు బిజినెస్ ఎక్స్పో మరింత ఉపయోగపడుతుందని జ్యోతి గ్రానైట్ మేనేజింగ్ డైరెక్టర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ ఛైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ అన్నారు. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు అండదండగా ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కృషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీ కమిషనర్ యువరాజ్, ఏ.పి.ఐ.ఐ.సి. వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



శిద్ధా సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దాతలు సహకరిస్తే గ్రంథాలయం ఏర్పాటు

ప్రజాశక్తి-తాళ్లూరు

తాళ్లూరులో గ్రంథాలయం స్థలం ఐదు సెంట్లు ఉందని, దానికి ప్రభుత్వం, దాతలు సహకరిస్తే గ్రంథాలయం భవనాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక తాళ్లూరులోని గ్రంథాలయ స్థలాన్ని ఆమె గ్రంథపాలకురాలు విజయకుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దర్శి, తాళ్లూరు, కురిచేడు మండలాలలో సొంత భవనాలు లేవని, అద్దె బిల్డింగ్‌లో ఉంటే ఖాళీ చేయాలని అంటున్నారని గ్రంథ పాలకురాలు విజయకుమారి తెలిపారు. కాబట్టి ప్రభుత్వం గాని, దాతలు గాని ఇక్కడ బిల్డింగ్ ఏర్పాటుకు సహకరిస్తే గ్రంథాలయాలు శాశ్వతంగా ఉండి తరతరాలకు జ్ఞానాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు.



తాళ్లూరులో శాఖా గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

కేంద్రం చేతిలో కీలుబొమ్మలుగా రాష్ట్రపాలకులు

(మొదటిపేజీతరువాయి)

సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రవేటీకరణను ఆపాలన్నారు. దేశంలో మహిళల మీద దాడులు,హత్యలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. బాపట్ల ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమాలకు పురిటి గడ్డ అని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలు కలిసి రావాలన్నారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత 2022 నుంచి ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో అనేక ప్రజా సమస్యలపై సిపిఎం పోరాటం చేసినట్లు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలవల్ల పడుతున్న భారాలను ఎదుర్కోవటానికి ప్రజలు పోరాటాలకు రావాలని పిలుపునిచ్చారు. తొలుత పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుంచి పట్టణంలో పాత బస్టాండు తవ్వకాలువ సెంటర్ మీదుగా రథం బజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. ఎర్రజెండాలతో బాపట్ల పట్టణం అరుణ శోభితంగా మారింది. సభలో సిపిఎం సీనియర్



మహాసభల సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్,సిహెచ్. మజుందార్,సిహెచ్. మణిలాల్, ఎన్.బాబూరావు, నాయకులు కె.శరత్, టి.వెంకటేశ్వర్లు,పి.మనోజ్,జి. సుధాకర్, వి.వెంకట్రామయ్య , జిల్లా మహా సభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది జెడ్.బాషా, సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, వామపక్ష అభిమానులు పాల్గొన్నారు.

మహాసభలు ప్రారంభం

సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు శనివారం రాత్రి ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. మహాసభలకు అధ్యక్షవర్గంగా నాయకులు సిహెచ్.మజుందర్, మోంద్రు ఆంజనేయులు, ఝూన్సీ వ్యవహరించారు. తొలుత కామ్రేడ్ సీతారాం ఏచూరి, దేశవ్యాప్తంగా మృతి చెందిన వామపక్ష నాయకులకు మహాసభ నివాళులర్పించింది. సంతాప తీర్మానాన్ని జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.మణిలాల్ ప్రవేశపెట్టారు. అనంతరం మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య గత మూడేళ్ల కాలంలో జరిగిన పోరాటాలు ఉద్యమాలపై నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలకు మినిట్స్ కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ తీర్మానాల కమిటీ ఏర్పాటు అయ్యాయి. సభలో రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు, డి.రమాదేవి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

సిఐ మల్లికార్జున రావు

ప్రజాశక్తి-కంభం రూరల్

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సీఐ మల్లికార్జున రావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలలో నూతన పోకడలు, గంజాయి, డ్రగ్స్ దుర్వినియోగం, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలు మరియు రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమయస్ఫూర్తితో సక్సెస్ సాధించాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయితీలో నిధులు దుర్వినియోగంపై శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి సాధారణ, ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు మాజీ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణ నిమిత్తం త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, మార్కాపురం డిఎల్‌పివో పి.భాగ్యవతి, ఆడిట్ విభాగం ఏవో కె.రమేష్‌బాబు విచారించారు. రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

పకడ్బందీగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు

(మొదటిపేజీ తరువాయి)

నానో యూరియా పిచికారీ చేయడానికి స్వయం సహాయక బందాలకు సబ్సిడీతో డ్రోన్‌లు మంజూరు, లక్ష్యాల పురోగతి పై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, బిఎన్. విజయ కుమార్ వివిధ అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల పై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షి స్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన నిధులను మండలాలకు, గ్రామాల అభివద్ధికి వినియోగించాలన్నారు. జిల్లా అభివద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే సిసి రోడ్లు, మురుగు నీటి కాలువల నిర్మాణం, వంటి అభివద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పుర్తిచేసేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలో జల జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌పై చర్యలు



జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. గహ నిర్మాణాలకు సంబంధించి 2014-19 కాలంలో మంజూరై పెండింగ్ లో వున్న సుమారు 27 వేల గహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లానియోజకవర్గాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేపట్టిన ఆ పథకాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో జిల్లా లో జరుగుచున్న సిసి రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు త్వరగా పూర్తీ చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో సూర్య ఘర్ పథకం పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సిఇఒ బి. చిరంజీవి, సి.పి.ఓ శ్రీ వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

జల జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులను పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. పిఎం గ్రామీణ సడక్ యోజన కింద చేపట్టిన రహదారులను వెంటనే పుర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఒంగోలు నగరానికి పశ్చిమ వైపు బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక బందాలలో 'లాక్‌పతి దీదీ' లక్ష్యాలను అందుకోవడం శుభపరిణామం, మరింత మందిని లాక్ పతి దీదీలు గా మార్చి పేదరికాన్ని తగ్గించాలని కోరారు. గ్రామాలలో నానో యూరియా పిచికారీకి స్వయం సహాయక బందాలకు డ్రోన్‌లను రూ.8 లక్షల వరకు సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా జిల్లాలో 2026 - 27 నాటికి కనీసం 5 లక్షల ఇండ్లకు సోలార్ ప్లాంట్‌ట్లు ఏర్పాటు చేసేలా ప్రజలను ప్రోత్సహించేలా అధికారులు కషి చేయాలన్నారు.



ఒంగోలులో బైపాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు



ఒంగోలు నగరానికి పశ్చిమ వైపు బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. అమత్ పథకంలో చేపట్టిన పనులు పూర్తి చేసినట్లయితే ఒంగోలు నగరానికి ప్రతి రోజు తాగునీరు ఇవ్వవచ్చని తెలిపారు.

పేర్నమిట్ట చెరువును అమృత్‌లో చేర్చండి



పేర్నమిట్ట వద్ద ఉన్న చెరువును అమత్ పథకంలో చేర్చాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ కోరారు. గుండ్లకమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ సంబంధించి రెండు మోటార్లు పనిచేయడం లేదని, కొత్త మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు.

జాతీయ రహదారిపై లైట్లు ఏర్పాటు



ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిలో మగ్గంపల్లి వద్ద లైట్స్ పనిచేయడం లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని, లైట్లు వేయాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. తాగునీటి పథకాలకు సంబంధించిన కొత్త పైప్ లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఉందన్నారు.

గిద్దలూరులో బైపాస్ నిర్మాణం చేపట్టాలి



గిద్దలూరు పట్టణానికి బై పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కమిటీ దష్టికి తీసుకొచ్చారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఎస్ఐ రాజ్ మోహన్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రెండో పట్టణ ఎస్ఐ డాక్టర్ రాజమోహన్ అన్నారు. శనివారం శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, మత్తుపదార్థాలు వాడితే కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మత్తు మందు వాడడం వలన శరీరంలో తెలియని మార్పులు చోటు చేసుకొంటాయన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశలోనే మత్తు బానిస అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కనుమర్ల శ్రీరాంరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ యస్.వి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గేటు ఊడిపడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రమాదవశాత్తు గేటు ఊడిపడి చిన్నారి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. కొరిశపాడు మండలం తిమ్మన పాలెం గ్రామానికి చెందిన రాయపాటి ప్రవీణ్ కుమార్ గ్రోత్ సెంటర్‌లోని చంద్రలేఖ గ్రానైట్స్ కంపెనీ వద్ద వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈయన మనుమడు ఫ్యాక్టరీ మెయిన్ గేటు వద్దకు వచ్చి ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు గేటు ఊడిపడటంతో రాయపాటి సూర్య (4) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న సిబ్బంది

పులి సంచారంతో రైతుల ఆందోళన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని దేవలూటి బేస్‌క్యాంపు పరిధిలోని గండిచెరువు, బొమ్మలాపురం పరిసర ప్రాం తాల్లో పెద్దపులి సంచరిస్తుం దని తెలియడంతో ఆ ప్రాంత రైతులు భయాందోళన చెందు తున్నారు. రాత్రి పొలాలకు కాపలాగా వెళ్లి ఉదయాన్నే రైతులు ఇంటికి వచ్చే సమయంలో ఒక రైతుకి పులి కనిపించింది. దీంతో ఆ ప్రాంత పొలాలకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అసలే మిరప తోటలకు కుచ్చు తెగులు సోకి ప్రతిరోజూ మందులు పిచికారీ చేస్తున్న నేపథ్యంలో పులి ఉందనే భయంతో రైతులు పొలాల వైపు వెళ్లడానికే జంకుతున్నారు. ఈ విషయం అటవీ అధికారులకు తెలియజేయడంతో అటవీ శాఖ సిబ్బంది గండిచెరువు, బొమ్మలాపురం పొలాలు తదితర ప్రాంతాల్లో పులి సంచరించిన ఆనవాళ్లను, పాదాలను గుర్తించారు. కాగా అటవీ ప్రాంతంలో నీటి సౌకర్యం లేకపోవడంతో జంతువులు నీటి కోసం పొలాల బాట పడుతున్నాయని అధికారులు తెలిపారు.


సీఎం సహాయనిది అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని జంపని గ్రామానికి చెందిన పాములపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకైన బిల్లులు రు.2,07,499 లను సీఎం సహాయ నిధి నుండి మంజూరు కాగా వాటిని శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు శనివారం చెక్కు రూపంలో అందజేశారు. మంజూరైన నగదును పాములపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందచేశారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిది ఎంతో దోహదపడుతుందన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తుందని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎడుగురు లబ్దిదారులకు రూ.6లక్షల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని చెప్పారు. మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బాబురావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రేమ హార్ట్ హాస్పటల్ ఎండి డాక్టర్ ఐ బాబురావు అన్నారు. పట్టణంలోని ఉడ్ నగర్‌లో ఉన్న స్థానిక బీసీ బాలికల వసతి గృహం ఆనంద నిలయంలో విద్యార్థులకు వైద్య శిభిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిభిరంలో ఎనభై మంది బాలికలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా శుచిగా, శుభ్రంగా ఉండాలని, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దంతవైద్య నిపుణులు ప్రదీప్, ఐ శుభాషిణి, ఎఎస్‌డబ్ల్యూ సాదిరెడ్డి, ఆనంద కుమారి, సుజాత, హాస్టల్ వార్డెన్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజలుపై విద్యుత్ డిస్కలు సర్దుబాటుపేరుతో పెంచిన విద్యుత్ బారాలను రద్దుచేయాలిని కోరుతూ స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ భారాల సర్క్యులర్ దగ్ధం చేసి శనివారం నిరసన తెలిపారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీద ప్రజలకు ఆశలు ఉన్నప్పటికీ గతప్రభుత్వం మీద సాకు చెపుతు ట్రూ అప్ చార్జీల పేరుతో గత నెలలో రూ.7వేల కోట్లపైన బారం వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు డిస్కంల ప్రతిపాదన పేరుతో విద్యుత్ చార్జీలు విద్యుత్ నియంత్రణ మండలి బోర్డు ఎటువంటి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రూ.9వేల కోట్లు వచ్చే డిసెంబర్ దగ్గర నుండి 2026 నవంబర్ వరకు యూనిట్‌కు 92పైసలు చొప్పున, ప్రజల దగ్గర నుంచి వసూలు చేసుకోవడానికి అనుమతించటం అంటే సిగ్గుచెటని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్తు బారాలను వెనకి తీసుకోవాలని కోరారు. ఈపాటికే సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలు, నిరుద్యోగులు, చేతి వృత్తిదారులకు అమలు చేస్తానన్న హామీలు అమలు చేయకుండా, మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు రోజువారి పెరుగుతుండతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు బారం తగ్గించకపోతే చారిత్రాతకమైన మరో విద్యుత్ పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కె ఆశీర్వాదం, కె రమేష్, జె ధర్మరాజు, ఆగస్టిన్ పాల్గొన్నారు.


సర్క్యూర్‌ను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

కాలువలకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

సాగునీరు, మురుగు కాలువల మరమ్మత్తులతోపాటు లాకుల సర్‌ప్లస్ గేట్లకు మరమ్మత్తులు నిర్వహించి రైతుల కు నీటి సరఫరా వివరాలు ముందుగా తెలియజేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్ లో బాపట్ల పౌర సమాఖ్య ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నీటి విధానం, సమస్యలు – పరిష్కారాలు అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పెద్ద ప్రాజెక్టుల పేరు చెప్పి చిన్న ప్రాజెక్టులపై ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. నీటి లభ్యత వినియోగం, పొదుపుపై వివరించారు. సభలో పౌర సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి శరత్ బోస్ మాట్లాడుతూ ప్రస్తుత సాగునీటి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని అన్నారు. సదస్సులో సెర్చ్ సంస్థ కార్యదర్శి సిహెచ్ పార్ధ సారథి మాట్లడుతూ భూగర్భ జల వనరుల వినియోగం, ఇంకుడు గుంతల అవసరం, నీటి నియంత్రణతో కూడిన సమగ్ర విధానాన్ని పభుత్వం తీసుకు రావాలని కోరారు. అంతర్జాతీయ సాగు, మురుగు నీటి కమీషన్ ఉపాధ్యక్షులు కె ఎల్లారెడ్డి మాట్లాడుతూ నీరు లభ్యత, నీటి వృధాను అరికట్టి పొదుపుగా నీటి వినియోగంపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సభలో పి హరిప్రసాద్, వ్యవసాయ కళాశాల ఎగ్రానమి శాఖాధిపతి కె చంద్రశేఖర్, ఇరిగేషన్ ఇఇ, ఎన్‌కెవి ప్రసాద్, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బి దశరథరామిరెడ్డి, ఎన్‌టిఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల జి రవిబాబు, పౌర సమాఖ్య కార్యదర్శి జి వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

ఫొటోగ్రాఫర్ నాగరాజుకు స్వర్ణ పతకం


ఉత్తమ ఫొటోగా ఎంపికైన ఛాయాచిత్రం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ 132వ పిక్టోరియాల్ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇండియన్ ఇంటర్నెషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్, ఫోటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్తంగా నవంబర్ నెలలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో మండలంలోని ముత్తాయపాలెంకు చెందిన ఫోటోగ్రాఫర్ పివిఎస్ నాగరాజుకు పి శేషుబాబు మెమోరియల్ బంగారు పతకం, అవార్డు లభించింది. అవార్డును గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ కె రామమోహనరావు ప్రదానం చేసినట్లు అవార్డు గ్రహీత నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ కౌన్సిలర్ కె గంగాధరరావు, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ లా ప్రిన్సిపాల్ ఎం సురేష్ కుమార్, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ జర్నలిజం మాస్ కమ్యునికేషన్ జె మధుబాబు, ఐఐపిసి డిజిటల్, ఫొటో జర్నలిజం విభాగం చైర్మన్ తమ్మా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజును బాపట్లకు చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న నాగరాజు

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బిఎఆర్ అండ్ టిపి గవర్నమెంట్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్ నందు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్య సంస్థ జిల్లా అధికారి పి ప్రణయ్ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలలు ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషు కుమారి తెలిపారు. 18నుంచి 35ఏళ్ల లోపు యువతీ, యువకులు డిసెంబర్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్లు ఇస్తున్నాయని స్కిల్ హబ్ ఇంచార్జ్ పి వినోద్ కుమార్ తెలిపారు. ఇతర వివరాల కొరకు 6302764962 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కట్ట మంగ

మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి - రేపల్లె

సవరించిన బడ్జెట్‌ను 2025 – 26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఎజెండాలోని 24 అంశాలతో పాటు బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. 2025 – 26 సంవత్సరానికి బడ్జెట్ రూ.28.03కోట్లు, మిగులు బడ్జెట్ రూ.1.80కోట్ల బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఇప్పటివరకు రూ.9.53కోట్ల నిధులు పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయడం జరిగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ విశ్వనాథ గుప్తా తెలిపారు. ఎజెండాలోని అంశాలను వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ప్రస్తావించగా కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ సాంబశివరావు, డిఈఈ మధుసూదనరావు, మేనేజర్ శివప్రసాద్, ఎఈలు రోహిణి, జాన్ శామ్యూల్, పారిశుద్ధ్య శాఖ అధికారి రామచంద్రరావు, రెవిన్యూ అధికారి రత్నాంజలి పాల్గొన్నారు.


వన సమారాధనలో టిడిపి నాయకులు శివప్రసాద్

ఐక్యత, సమిష్టి కృషితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - రేపల్లె

ఐక్యత, సమిష్టి కృషితోనే ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ పేర్కొన్నారు. కార్తీక వన సమారాధన ద్వారా గౌడ సంఘీయులు ఐక్యత, సమిష్టిగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఇసుకపల్లి శివాలయంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా 70ఏళ్ళు పైబడిన వారిని ఘనంగా సత్కరించారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో సహా వనభోజనాల్లో పాల్గొన్నారు. తొలుత కృష్ణా టాకీస్ వద్దగల మాజీ మంత్రి అనగాని భగవంతరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఐక్యత తోనే జాతి అభివృద్ధి బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సిహెచ్ నాగమల్లేశ్వర రావు, డి అమర్నాథ్, బి వెంకటనారాయణ, పరిసా వెంకటేశ్వర్రావు, తాత ఏడుకొండలు, గుర్రం మురహరరావు, గుర్రం విజయలక్ష్మి, కేసన రామస్వామి, మృత్యుంజయరావు, నరసింహారావు, కెవి గోపాలరావు, కేసన రాంబాబు, వై ధర్మతేజ, ఉప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 1న ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి శనివారం తెలిపారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖలపై అందరూ అధికారులతో శాఖ పరమైన అభివృద్ధి సమీక్ష జరుగుతుందని అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలో మండలంలోని గ్రామాల వారీగా జరిగిన పనుల వివరాలతో సమావేశానికి కోరారు. ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

పెట్టుబడులు పెరిగి.. దిగుబడులు తగ్గి..

- గిట్టుబాటు ధరలు లేక అవస్థలు
- దోపిడీ చేస్తున్న దళారులు
- ఆందోళనలో పత్తి రైతులు

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

ఆరుగాలం కష్టించి పండిన పత్తి పంట దళారుల పాలవుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పత్తి రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. పశ్చిమ ప్రకాశంలో పత్తి కొనుగోలు చేయకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మార్కాపురంలోని మార్కెట్ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏటా పత్తి కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది కూడా సిసిఐ కేంద్రం ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆగష్టులో ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకూ ఆమోదం తెలపలేదు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పుల్లలచెరువు మండలంలో 3,615 ఎకరాలు, త్రిపురాంతకం మండలంలో 427 ఎకరాలు, పెద్దారవీడు మండలంలో 2.697 ఎకరాలు, పెద్దదోర్నల మండలంలో 2,070 ఎకరాలు, యర్రగొండపాలెం మండలంలో 2,205 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి బాగా తగ్గింది. గతంలో ఎకరాకు సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది నాసిరకం విత్తనాల కారణంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎకరాకు నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు భారం..

ఎకరాలో పత్తి పంట సాగు చేయాలంటే సుమారు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. గత ఏడాది వైసిపి ప్రభుత్వ హయాంలో యూరియా రూ.280, డీఏపీ రూ.1285, పలు రకాల ఎరువులు తక్కువ ధరలకే లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ ఏడాది యూరియా రూ.400, డీఏపీ రూ.1600 చేరింది. పురుగు మందులను రేట్లు 30 శాతం పెంచి విక్రయిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. కూలీ రేట్లు సైతం పెరిగిపోయాయి.



పత్తి చేను

కానరాని మద్దతు..

గత ఏడాది నవంబర్‌లో ప్రైవేట్ వ్యాపారులు క్వింటా పత్తిని రూ.6,800 నుంచి రూ.7000కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రూ.5,500 నుంచి రూ.6,000 మించి కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7621 రైతుల దరి చేరడం లేదు. మద్దతు ధర ప్రకటన కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వపరంగా కొనుగోలు చేయకపోవడమే ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పశ్చిమ ప్రకాశంలో ఈ సీజన్‌లో ప్రతి ఏడాది మార్కాపురంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేవారు. కష్టమో, నష్టమో అక్కడకు వెళ్లి రైతులు తమ పంటను అమ్ముకునేవారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో అటు వ్యాపారులు, దళారులూ ప్రభుత్వం కంటే కాస్త ఎక్కువ ధరే చెల్లించిన పరిస్థితి ఉండేది. పత్తి కొంటే తామే కొనాలి తప్ప ఎవరూ కొనే పరిస్థితి లేదని వ్యాపారులు అనుకుంటున్నారు. ఇదే అదనుగా బేరసారాలు సాగిస్తున్నారు. పత్తి నాణ్యంగా లేదని, తేమ ఉందంటూ వెళ్లిపోతున్నారు. మరోవైపు వాతావరణ పరిస్థితులు బాగాలేకపోవడం, పంటను దాచుకునే పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు ఇచ్చిన ధరకే రైతులు పత్తి విక్రయిస్తున్నారు.

గిట్టుబాటు ధర లేదు



తిరుమలరెడ్డి జనార్ధన్‌రెడ్డి, రైతు

పత్తికి ధర గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. పెట్టుబడులు పెరిగాయి. దిగుబడులు తగ్గాయి. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం కొంటే కొంత ఎక్కువ ధర వచ్చేది. వాతావరణం బాగాలేదు. పంటను ఎన్నాళ్లు ఇంట్లో దాచుకోవాలో అర్థం కావడం లేదు. దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తుంది.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

మండ్లి మలయ్య, రైతు చెర్లోతాండా



పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడే ఈ ప్రాంత రైతులకు మద్దతు ధర లభిస్తుంది. లేకపోతే వ్యాపారులు ఎంత చెబితే అంతకే అమ్మాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తే రైతులకు కొంతమేర ఊరట కలుగుతుంది.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి

కళా వేదిక ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. అట్టడుగు వర్గాల పిల్లలు ఉన్నత విద్యాభ్యాసం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టిందన్నారు. ఒంగోలు దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో రూ.9.35 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ కళావేదికను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు మేయర్ గండాడ సుజాతలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని విధాలుగా అభివద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులు, ప్యాకెట్ మనీని డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం హాస్టల్ భవనంపై రూ.5 కోట్లతో మరో రెండతస్తుల నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఒంగోలులోని అన్ని హాస్టళ్లలో రూ.35 కోట్లతో అభివద్ధి పనులు చేపడతామని తెలిపారు. అధ్యాపకులు మరింత అంకిత భావంతో పనిచేసి కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలు వచ్చేలా కషి చేయాలని సూచించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ డిఎస్ ప్రభుత్వ ఉమెన్స్ ప్రభుత్వ కళాశాలను తన దత్తత కాలేజీగా భావిస్తున్నట్లు తెలిపారు. కాలేజీకి అవసరమైన కంప్యూటర్లను ఇప్పటికే తాను సమకూర్చానని, న్యాక్ గుర్తింపు లభించడంలోనూ తన వంతు బాధ్యత నెరవేర్చానన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రెండు కోర్సులతో 1984 లో ప్రారంభ మైన ఈ కాలేజీలో నేడు 5 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కాలేజీ విద్యార్థినుల కోసం అవసరమైన బస్సు సౌకర్యాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని, బైపాస్ నుంచి నేరుగా ఈ ప్రాంగణంలోకి ప్రవేశించేలా ప్రత్యేక రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కాలేజీ ఇప్పటికే తాగునీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, నగదు పారితోషకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కళ్యాణి, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు భాస్కరబాబు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి



కళావేదికను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల



విచారణకు హాజరైన ఎమ్మెల్యే చంద్రశేఖర్

విచారణకు హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో సిఐ సిహెచ్ ప్రభాకరరావు, ఎస్ఐ పి.చౌడయ్యల ఎదుట ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విచారణకు హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్‌పై ఎక్స్‌లో అభ్యంతరకర పోస్టులు పెట్టడంపై పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. అదే విధంగా జరిగిన ఎన్నికల్లో సైతం పలు మండలాల్లో మరో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన విచారణకు హాజరయ్యారు. పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మోర్తాల సుబ్బారెడ్డిని అరెస్టు చేయడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం కావాలనే ఇలాంటి కుట్ర పూరిత అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

బంగారం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని బంగారు షాపులపై శనివారం లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. బిల్లులు సక్రమంగా రాయని రెండు షాపులకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ అధికారి ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులు బంగారు ఆభరణములు కొనుగోలు చేసినప్పుడు వారికి బిల్లులు సంపూర్ణంగా రాసి ఇవ్వాలన్నారు. బిల్లులపైన బంగారం రకం తెలియజేసే విధంగా ఎన్ని క్యారెట్‌లో బిల్లుపై వివరంగా రాయాలన్నారు. బిల్లులు సక్రమంగా రాసి ఇవ్వకపోతే జరిమానాలు విధిస్తామన్నారు. వినియోగదారులు కూడా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసినప్పుడుగా విధిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మార్కాపురం ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహమ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న కార్తీక వనభోజనాలను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు కోరారు. మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడక స్వాములు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా వనభోజనాలను వేడుకగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జడ్‌పిటిసి మొనపాటి రామకష్ణ, మాజీ వైస్ సర్పంచి గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల బస్సులు అడ్డగింత

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల పరిధిలోని మైనంపాడులో క్విస్ కళాశాలలకు చెందిన బస్సులను గ్రామస్తులు అడ్డుకున్నారు. నాలుగు రోజుల క్రితం కళాశాల బస్సు కారణంగా గాయపడిన బాషాను ఆదుకోవాలని కోరుతూ బస్సులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వేజెండ్ల అజయ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. అనంతరం ఘటన గురించి ఒంగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్ బాబుకు వివరించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు కళాశాల యాజమాన్యంతో మాట్లాడతానని ఎస్ఐ అజయ్‌బాబు ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లెనిద్రలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పి టిపి విఠలేశ్వర్

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్

ప్రజాశక్తి - పంగులూరు

ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు, ప్రజల మధ్యకి పోలీసులు వెళ్లాలనే ఉద్దేశంతో ఎస్పీ తుషార్ డూడి 'పల్లెనిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అడిషినల్ ఎస్పి టిపి విఠలేశ్వర్ తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం వారి పరిధిలోని గ్రామాల్లో బస చేయాలని ఆయన అన్నారు. పంగులూరు 1వ సచివాలయం దగ్గర ప్రజలతో శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వివరించారు. వాటి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆయనతోపాటు అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు, జె పంగులూరు ఎస్ఐ వినోద్ బాబు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాల గురించి, చెడు నడత కలిగిన వ్యక్తుల సమాచారం సేకరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయో వివరించారు. వాటి బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలనే విషయాల గురించి ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా పాటించవలసిన రోడ్డు భద్రత నియమాలను వివరించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులకు అండగా పోలీసు శాఖ ఉంటుందన్నారు. ఎవరైనా వారిపట్ల అసభ్యకరంగా వ్యవహరించినా, వెంటపడి వేధించినా, నేరాలకు పాల్పడినా చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వలన మద్యం మత్తులో ఏదైనా నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నేరాలను కట్టడి చేసే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు (లేదా) డయల్ 112 నవంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంచబడతాయని తెలిపారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

పింఛన్ పంపిణీపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - చీరాల

పింఛన్లు పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక ద్రుష్టి వహించి డిసెంబర్ 1న సెలవు కావడంతో శనివారం రోజే పంపిణీ చేశామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆయన స్వయంగా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి బటన్లు నొక్కుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని ఆరోపించారు. పేరాలలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన



సదస్సులో మాట్లాడుతున్న హెల్ప్ సంస్థ డైరెక్టర్ విబి సాగర్



ర్యాలీ నిర్వహించిన ఎబిఆర్ కాలేజ్ విద్యార్థులు

ప్రజాశక్తి - అద్దంకి

అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా దిశ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హక్కుల మార్గాన్ని ఎంచుకోండి, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన నా హక్కు అంతర్జాతీయ స్థాయిలో ఈ నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కిరణ్, హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్ అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి ఆత్మ శాంతించాలని కోరారు. మృతుల కుటుంబ సభ్యులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని సంఘీభావం తెలపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. మార్టూరు హెల్ప్ టిఐ అవుట్రిచ్ వర్కర్ కె దుర్గ, జె రూతు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిని డాక్టర్ అనిత జ్యోతి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి, వారిలో ఆత్మస్థైర్యం కలిగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందిని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి సమూల నిర్మూలన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విశ్రమించకుండా కృషి చేస్తేనే నిర్మూలించడం సాధ్యమవుతుందని అన్నారు. జి రమేష్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల కొరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, మందులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎవరైనా హెచ్ఐ, ఎయిడ్స్ బాధితులు మందులు వాడకుండా మధ్యలో ఆపేసిన వారిని గుర్తించి తిరిగి మందులు వాడుకునే విధంగా చూడాలని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో తల్లిదండ్రులు కోల్పోయిన బాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె ఓబుల్‌రెడ్డి, అవుట్రిచ్ వర్కర్లు కరుణ మల్లేశ్వరి, పిఈలు అమ్మ మల్లేశ్వరి, శివ పార్వతి, పార్వతి, ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు, మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె : ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్ఎస్ఎస్ అండ్ ఎన్సిసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవి చంద్ర కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభిం చారు. ఎయిడ్స్ విధ్వంసాన్ని నివారిద్దాం నిరంతరం జాగరూకత నింపుదామని అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, ఎయిడ్స్ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడం, హెచ్ఐవి కివ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బుజ్జి బాబు మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఎయిడ్స్ వ్యాధికి మందులేదు, నివారణ ఒక్కటే మార్గమని నినాదాలు చెప్పి అవగాహన కల్గించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, డాక్టర్ దాసు, కె బాల గురవయ్య, క్యాడట్లు, వాలంటీర్స్ పాల్గొన్నారు. ఎయిడ్స్, హెచ్ఐవి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం డిసెంబరు 1న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించడం, ఎయిడ్స్ రోగులకు మద్దతు ఇవ్వడం, ఎయిడ్స్ ప్రతి రోధానికి ప్రపంచ సమాజాన్ని ఒకచోట చేర్చడమని తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణ అధికారి రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌కు మందులేదని, కేవలం నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రతి ఏటా ఒక కొత్త స్లోగన్ ఎంపిక చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి రూప శ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి గోపాలరావు, న్యాయవాదులు హరికుమార్, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు జీవన్, చైతన్య, పృధ్వి, గణేష్, స్టాఫ్ నర్స్ ఝాన్సీ లక్ష్మి, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : హెచ్ఐవి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ జి విష్ణుతేజ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఔట్రిచ్ వర్కర్ కంద్రాతి దుర్గ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయత కలిగి ఆత్మస్థైర్యం కలిగించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. హెచ్ఐవి బాధితుల కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు మధ్యలో ఆపకుండా సక్రమంగా వినియోగించుకునేలా స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఐవి బారిన పడి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల పట్ల వివక్ష చూపించకుండా వారిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సాయి ప్రసాద్, ఐసిటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, వసంత నర్సింగ్ సిబ్బంది, రోటరీక్లబ్ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరావు, కంటి వైద్య నిపుణులు సుబ్రహ్మణ్యం ఎస్‌కె కాజా హుస్సేన్, హెల్ప్ ప్రతినిధులు జె రూతు, రమ్య, సల్మా, సరోజినీ పాల్గొన్నారు.

చీరాల : హెచ్ఐవిపై అందరికి అవగాహన అవసరమని డాక్టర్ డేవిడ్ డేవిడ్సన్ సాల్మన్ అన్నారు. షాడోస్, వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ నీలా కుమారి మాట్లాడుతూ డాక్టర్ డేవిడ్సన్ సాల్మన్ 33ఏళ్లుగా ఎంతోమంది హెచ్ఐవి బాధితులను ఆదరించారని ప్రశంసించారు. రాజా సాల్మన్ మాట్లాడుతూ హెచ్ఐవి నాలుగు విధాలుగా వస్తుందని తెలిపారు. హెచ్ఐవి బాధితులు ఏఆర్టి మందులు వాడుకోవడం వలన జీవిత పరిమాణం పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, అలేఖ్య, కళాశాల సిబ్బంది నీరద, ఎన్ఎస్ఎస్ పిఓ భాగ్యలక్ష్మి, ఉమెన్ ఎంపవర్మెంట్ రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ రత్నపాక, రోహిణి, మీనా, అభిజిత్, పావని, పిచ్చేశ్వరరావు, బాల, జానీ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సంద ర్భంగా వైద్య ఆరోగ్య, ఎయిడ్స్ నివారణా నియంత్రణ విభాగం ఆధ్వర్యం లో కలెక్టర్ వెంకట మురళి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మ పర్యవేక్షణ లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిం చారు. మున్సిపల్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌తో మరణించి న వారికి సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కమీషనర్ రఘునాథ్‌రెడ్డి, ఏపీ శాక్స్ క్లస్టర్ మేనేజర్ జానిభాష, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం



అద్దంకిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖ అధికారి ఎల్ భీమయ్య, ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు పరిపాలనలో ఉంటే సంక్షేమ పథకాల అమలు తీరుకు పింఛన్లు పంపిణీ ప్రత్యక్ష ఉదాహరణని అన్నారు. కరిముల్లా మాట్లాడుతూ ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సగర్వంగా నిర్వహిస్తోందని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే తొలి నెల నుంచే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతినెలా 1న పంపిణీ చేస్తున్నామని అన్నారు. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రభుత్వం నవంబర్ 30న పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి, సంక్షేమ శాఖ అధికారి బుర్ల అంకారావు, స్థానిక టిడిపి నేతలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు : చుండూరు, అమృతలూరు మండలం పెదపూడి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శనివారం ప్రారంభించారు. డిసెంబర్ 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా ఆయన తెల్లవారు జామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో పోకూరి సురేంద్ర పాల్గొన్నారు.

పంగులూరు : ప్రభుత్వం ప్రతిష్ఠగా తీసుకొని ఇస్తున్న సామాజిక పింఛన్లను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సమన్వయంతో పంపిణీ చేసినట్లు టిడిపి నాయకుడు కుక్కపల్లి ఏడుకొండలు తెలిపారు. మండలంలోని ముప్పవరం గిరిజన కాలనీలో తాము శనివారం పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. తెల్లవారు జాము ఐదు గంటలకే లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి వారిని నిద్రలేపి పింఛన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా నెలనెలా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

నగరం : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ నెల ప్రారంభానికి ఒకరోజు ముందే లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో పంపిణీ వేగవంతం చేసినట్లు తహశీల్దారు నాంచారయ్య తెలిపారు. లబ్ధిదారులకు పింఛన్లు నేరుగా అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తొలిరోజు 90 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న నగరం తహశీల్దారు నాంచారయ్య

వర్షాలకు నేల వాలుతున్న వరిపైరు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వరి పైరు నేల వాలిపోతుంది. రైతులు సాగుచేసిన వరి పంట పూర్తిగా కోతలకు సిద్ధమై ఉంది. అక్కడక్కడ హార్వెస్టర్లు వినియోగించి కోసిన కోతలు సాగులో ఐదు శాతం కూడా పూర్తికాలేదు. అదికూడా కొల్లూరు, వేమూరు, అమర్తలూరు మండలాల్లో కొంతమేర మాత్రమే కొనసాగింది. మిగిలిన సాగు భూమి మొత్తం కోత కోయడానికి సిద్ధంగా ఉంది. ఇలాంటి తరుణంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు పూర్తిగా నేల వాలుతున్నాయి. దీనివలన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి ప్రకృతి విలయ తాండవంతో ప్రతి ఏట నష్టపోతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన అధిక



భట్టిప్రోలులో వర్షాలకు నేల వాలిన వరిపైరు

వర్షాలకు వేల ఎకరాల్లో పూర్తిచేసిన నాట్లు వర్షానికి మునిగిపోయి పూర్తిగా దెబ్బ తిన్నాయి. దీనికి ప్రభుత్వం నష్టపరిహారం అందించినప్పటికీ రైతులు, కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముందుగానే కౌలు చెల్లించిన కౌలుదారులకు కౌలుతో పాటు పెట్టిన ఖర్చులు నీటిపాలు అయ్యాయని రబీ సీజన్లోనైనా అపరాలు, మొక్కజొన్న, పంట సాగు చేపట్టడం ద్వారా నష్టాన్ని భర్తి చేసుకో వచ్చున్న ఆశతో కౌలుదారులు ఎదురు చూస్తున్నారు.

పైరు నేల వాలితే అన్ని విధాలా నష్టమే

పంట కోతలకు సిద్ధమైన సమయంలో పైరు వర్షాలకు నేల వాలితే రైతులకు అన్ని విధాల నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేల వాలిన పైరు వర్షాలకు గింజ మునిగిపోతే మొల కొచ్చి రంగు మారి నష్టపోయే ప్రమాదం ఉందని, దీని కారణంగా దిగుబడులు తగ్గిపోవడమే కాక ధాన్యం ధరలో కూడా కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక వరి కోతలు కోయటానికి కూడా కూలి రేట్లు అధికమయ్యే అవకాశం ఉందని, దిగుబడులు, ఖర్చులు అధికమై మరింత నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న రీతిలో పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.



ఫ్లెక్సీ మేకింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న విద్యార్థినులు

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉపాధి

ప్రజాశక్తి - సంతమాగులూరు

భవిష్యత్తు నందు విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని కంప్యూటర్ ఒకేషనల్ కోర్సు జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఏల్చూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు 9, 10 తరగతుల విద్యార్థులకు జరుగుతున్న కంప్యూటర్ ఒకేషనల్ కోర్సును ఆయన శనివారం సందర్శించారు. అనంతరం పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు నందు ఉన్న ఫ్లెక్సీ మేకింగ్ సెంటర్ ఇండస్ట్రియల్ విజిట్‌కు విద్యార్థినులను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో రాబోయే ఐటీ రంగ ప్రాధాన్యత వివరించారు. కంప్యూటర్‌పై పట్టు ఉంటే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఎం నాగ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ధారా బాలయ్య పాల్గొన్నారు.



ప్రతిభావంతుల సభలో జ్యోతి చంద్రమౌళి

సినీనటులకు అభినందన

ప్రజాశక్తి అద్దంకి

చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ఆర్టీసి రిటైర్డు ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆచంట వెంకట రత్నం కళా వేదికగా జరిగిన సభకు జ్యోతి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ప్రముఖ సినీ నటులు ప్రభాకరరెడ్డి గురించి దాసరి లక్ష్మి ప్రసంగించారు. సినీ నటి గిరిజ గురించి గ్రంథి నాగరాజ కుమారి మాట్లాడారు. హాస్యం ప్రధానంగా మాత్రమే కాకుండా చక్కని కుటుంబ కథా చిత్రాల్లో మంచి పాత్రలతో అలరించిన గిరిజ గొప్ప నటి అని వివరించారు. ప్రభాకరరెడ్డి నటన గురించి వివిధ సినిమాలు ఉదహరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో వి సీతారామశాస్త్రి, అన్నమనేని వెంకట్రావు, ఆర్‌వి రాఘవరావు, చందలూరి నారాయణరావు, దేవపాలన, పిసిహచ్ కోటయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి సమావేశం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గుంటూరు ఉమ్మడి జిల్లా స్థాయి 6వ సాంఘిక సంక్షేమ స్థాయి సంఘ సమావేశం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 'షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగలు, వెనకబడిన తరగతుల, వికలాంగుల సంక్షేమం, సాంస్కృతి కార్యక్రమం, మైనార్టీ సంక్షేమ సమావేశం గుంటూరు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగింది. సాంఘిక, గిరిజన, బిసి, మైనార్టీ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు హాజరై జిల్లాలో ఆయా సామాజిక వర్గాలకు అందుతున్న నిధులు, పిల్లల సంక్షేమం, సమీక్ష చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు కొన్ని సంక్షేమ పథకాలు త్వరలో రానున్నాయని, వాటిని వచ్చిన



సమావేశంలో గుంటూరు జెడ్‌పి వైస్‌చైర్మన్ అనూరాధ

తర్వాత అమలు చేస్తామని స్థాయి సంఘం చైర్మన్ అనురాధకు అధికారులు వివరించారు. సమావేశంలో జడ్పిటిసి మల్లు స్వామి, అన్నపూర్ణ, విజయలక్ష్మి, షేక్ షఫీ, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రస్తుతం కురుస్తున వర్షాల నేపథ్యంలో వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ ఆర్ వెంకటేశ్వరరావు తెలిపారు. డిసెంబరు 2వరకు వర్షాలు ఉన్నందున రైతులు వరి కోతలు జరపరాదని సూచించారు. వర్షాలు, ఈదురు గాలులకు పంట నేలకొరిగి నీట మునిగిన పంటపై రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. ఐదు కిలోల కళ్ళు ఉప్పు ఒక ఎకరానికి పైరుపై చల్లుకోవచ్చని తెలిపారు. పంట కోసిన ధాన్యం కల్లాల్లో ఉంటే టార్పొలిన్ పట్టాలతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా గోతాల్లో నింపి అమ్మడానికి సిద్ధంగా ఉన్నట్లయితే ముందుగా రైతు సలహా కేంద్రాలకు వెళ్లి షెడ్యూల్ తీసుకుంటే ప్రోక్యూర్ మెంట్ సిబ్బంది తేమశాతం చూస్తారని తెలిపారు. ఆ తరువాత రైతులకు ఇష్టం వచ్చిన



వరి రైతులకు సూచనలు చేస్తున్న కొల్లూరు ఎఒ

రైస్ మిల్లర్లకు ధాన్యం అమ్ముకోవచ్చని తెలిపారు. మండలంలో 203.4 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని, అమ్మిన రైతులకు 24 గంటలలోపే నగదు జమ చేశామని తెలిపారు.

క్రీడా పోటీలకు హాజరయ్యే వికలాంగులకు

ఆన్ డ్యూటీగా మినహాయింపు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు హాజరయ్యే దివ్యాంగ ఉద్యోగులకు 'ఆన్ డ్యూటీ' పీరియడ్‌గా పరిగణిస్తున్నట్లు కలెక్టర్ జె వెంకట మురళి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం డిసెంబర్ 5న స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని డిఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు జరుగుతాయని అన్నారు. ఆ పోటీలకు హాజరయ్యే బాపట్ల జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులకు ఆన్ డ్యూటీ పిరియడ్‌గా పరిగణించాలని ఆదేశించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు వీలు కల్పించాలని అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి దివ్యాంగులు హాజరుకావాలని కోరారు.

కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - రేపల్లె

వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహద పడతాయని పద్మశాలీయ సంఘ ప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో పద్మశాలీయ ప్రతినిధులు గోలి వెంకటేశ్వరరావు, దివి ధనుంజయరావు, గిరి రావు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజకీయ, ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -రేపల్లె

కార్తీకమాసం సందర్భంగా మండలంలోని చిన్న అరవపల్లిలో కాపుల కార్తీక వన సమారాధన బాలకోటేశ్వరస్వామి ఆలయం నందు కాపు కుల సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధన శనివారం నిర్వహించారు. కాపు సంఘ వన సమారాధనలో బంధు మిత్రుల సమక్షంలో కార్తీక వన భోజనాలు నిర్వహించారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, మండలాల నుండి కాపు సోదరీ, సోదరులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కమతం సాంబశివరావు మాట్లాడుతూ ఐక్యతతోనే రాజకీయ, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని అన్నారు. మరింత సామాజిక స్పృహ పెరిగి సొంత కులంలో ఆర్థికంగా దెబ్బతిన్న వారిని ఆదుకోవడానికి, విద్యా, వైద్యానికి సాహాయం అందించడానికి కార్తీక వన సమారాధన వేదికగా చేశారని అన్నారు. క్రమంగా సామాజిక సంఘటిత శక్తిని చాటేందుకు ఉపయోగించు కోవడంతో



కాపు వన సమారాధనకు హాజరైన నాయకులు

పాటు రాజకీయం గా రాణించేందుకు దిశానిర్దేశం చేసేలా వన సమారాధనలు మారాయని అన్నారు. కార్తీక వన సమారాధనలతో మరింత చైతన్య వంతమైందని అన్నారు. 2029 లో పవన్ కళ్యాణ్‌ను సీఎం చేయటానికి అందరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్ర మాలు, వనబోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో జన సేన నాయకులు కమతం సాంబశివరావు, ఉగ్గిరాల సీతారామాంజనేయులు, ఉమ్మడి గుంటూరు జిల్లా జన సేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, ఉషాద్రిపతి, జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, చందు సాంబశివ రావు, మల్లెల రామచంద్రారావు, గడ్డం రాధాకృష్ణమూర్తి, దేవగిరి సాంబయ్య, దామెర్ల రాజారావు, మీసాల శ్రీనివాసరావు, కేశంశెట్టి రమా శాంతాదేవి, వడ్డి వెంకటేశ్వరరావు, గరికపాటి రేణుకయ్య, అడపా మాణిక్యరావు పాల్గొన్నారు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పంగులూరు

జాతీయ రహదారిపై ముందుగా వెళుతున్న లారీని వెనుక నుండి వచ్చిన ట్రావెల్ బస్సు ఢీకొట్టిన సంఘటన శనివారం తెల్లవారు జామున ముప్పవరం ఫ్లై ఓవర్‌పై జరిగింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలవటంతో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున కెమికల్ పౌడర్‌లోడుతో చెన్నై నుండి ఒరిస్సాకు లారీ వెళుతుండగా ముప్పవరం ఫ్లైఓవర్ మీద వెళుతుండగా పులివెందుల నుండి విజయవాడకు ట్రావెల్ బస్సు వెళుతుంది. వేగంగా వచ్చిన బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సులో ఉన్న విజయవాడ బెంజ్ సర్కిల్‌కు చెందిన బండారు కీర్తి, పులివెందుల మండలం మల్లెల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ, రేపల్లెకు చెందిన వైష్ణవికి గాయాలయ్యాయి. వీరిని వైద్య చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తప్పిపోయిన బాలుడు క్షేమం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 6వ వార్డుకు చెందిన గంటా కార్తీక్ (5) అనే బాలుడు ఆడుకుంటూ ఇంటి నుండి బయటకు వెళ్ళాడని పట్టణ సీఐ మల్లికార్జునరావు చెప్పారు. చుట్టుప్రక్కల అంతా వెతికిన ఎక్కడ కనిపించకపోవడంతో తల్లి, దండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు తీసుకున్న పోలీసులు 16గంటల పాటు బాలుడు ఆచూకీ కనిపెట్టేందుకు, వివిధ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. బాలుడు క్షేమంగా పట్టణంలోని నారాయణ స్కూల్ వద్ద ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని బాలుడు కార్తీక్‌ను స్టేషన్ తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పారు. పిల్లవాడిని అతి కొద్ది సమయంలోనే తమకు అప్పగించటం పట్ల బంధువులు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్ల బిగింపు అన్యాయం


- సిపిఎం నగ కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు
- విద్యుత్ డి3 కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని షాపు యజమానుల అనుమతి లేకుండా బిగించటం అన్యాయమని సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని స్థానిక విద్యుత్ డిఇ, ఎఇ, సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో స్మార్ట్ మీటర్లను బిగించడం మానుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లు బింగించితే ప్రీపెయిడ్, ఫోన్ రీఛార్జ్‌లా విద్యుత్‌కు కూడా ముందుగానే రీఛార్జ్ చేయించుకోవాలన్నారు, రీఛార్జ్ అయిపోగానే విద్యుత్ ఆగిపోతుందని ఎప్పుడు ఆగిపోతుందో తెలియదన్నారు, సర్దుబాటు ఛార్జీల పేరుతో 2022 నుంచి 2024 వరకూ రూ. 20 వేల కోట్లు ట్రూ ఆప్ ఛార్జీలను మోపి ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారన్నారు. నేడు రూ.9,114 కోట్ల భారం మోపుతున్నారని, ఇంత భారం ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డి కరీం, షేక్ గౌస్ బాషా, షేక్ మౌలాలి, సయ్యద్ రియాజ్, షేక్ ఖాదర్ బాషా, మదర్ వలి, అల్లాభక్షు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి కార్యాచరణ

- మార్క్సిజం-లెనినిజం ఆవశ్యకత ప్రజలకు అవసరం
- ప్రజల ప్రయోజనాలు విస్మరిస్తున్న కేంద్రం
- కేరళలో ప్రజారంజక పాలన
- శాసనమండలి మాజీ సభ్యులు ఎంవిఎస్.శర్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మార్క్సిజం-లెనినిజం మూల సూత్రాల ఆధారంగా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి జరగాల్సిన కషిపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు శాసనమండలి మాజీ సభ్యులు ఎంవిఎస్. శర్మ పేర్కొన్నారు. మార్క్సిజం-లెనినిజం ఆవశ్యకతే ప్రజలకు అవసరమని తెలియజేశారు. చీమకుర్తిలో సిపిఎం జిల్లా మహాసభలు ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించున్నారు. ఈ సందర్భంగా 'సమకాలీన పరిస్థితులు-మార్క్సిజం-లెనినిజం ఆవశ్యకత' అనే అంశంపై సెమినార్ ఒంగోలు కాపు కళ్యాణ్ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సెమినార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంవిఎస్. శర్మ మాట్లాడుతూ 1980 నుంచి సామ్రాజ్యవాదం దాడి ప్రారంభమైందన్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఉన్న విధంగా సామ్రాజ్యవాదం నేడు లేదని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపంలో పనిచేస్తుందని తెలిపారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో తీవ్రమవుతున్న దోపిడీ, ఉధృతమవుతున్న సంక్షోభాల కారణంగా అసంతప్తి గురైన వివిధ వర్గాల ప్రజలు పోరాడుతున్నారని, ఈ పోరాటాల వెల్లువ నుంచి రాజకీయ మార్పులు జరుగుతున్నాయన్నారు. కొన్ని దేశాలలో ప్రత్యామ్నాయ విధానాలను అమలుచేసే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, అందులో భాగమే శ్రీలంకలో ఎన్నికల ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారన్నారు. ఎక్కువ దేశాలలో మితవాద శక్తులు బలపడుతున్నాయని, మరోవైపు సోషలిస్టు దేశాలు సంక్షోభాలను తట్టుకొని అభివద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ విశాల ప్రజానీకం ప్రయోజనాలను విస్మరిస్తుందన్నారు. మరో వైపు లౌకిక, ప్రజాస్వామిక, ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ దష్ట విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ప్రజాపోరాటాలు చేయాలన్నారు. వామపక్ష లౌకిక, ప్రజాతంత్ర శక్తులు బలపడాలని సిపిఎం భావిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగుతూనే ఉన్నాయని, ఇందుకు తార్కాణమే అదానీ అవినీతి అని పేర్కొన్నారు. ఆశించిన స్థాయిలో ప్రజా సానుకూల చర్యలు, ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. దేశంలో కేరళరాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం మాత్రమే ప్రజారంజక పాలన సాగిస్తుందన్నారు. ప్రత్యామ్నాయ విధానాల వ్యాప్తికి కృషి చేస్తుందని తెలియజేశారు. పోస్టు మోడ్రనిజం కొత్త పుంతలు తొక్కుతుందని, అస్తిత్వవాదం, ప్రాంతీయవాదంతో రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటుందన్నారు. ఈ విషయమై ప్రజల్లో చైతన్య తేయడం కోసం కమ్యూనిస్టులుగా కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి ఎస్‌కె.మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్, పాల్గొన్నారు.

పంపుల మరమ్మతులపై ..

చేతులెత్తేశారు..!

- మరమ్మతులకు నోచని వైనం
- ప్రజలకు తప్పని నీటి కష్టాలు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

చేతి పంపులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్లుగా వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో తుప్పు పట్టి అధ్వానంగా తయారయ్యాయి. బోర్లలో నీరు ఉన్నా మరమ్మతులు చేయని కారణంగా అవి నిరుప యోగంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. వర్షాలు సమద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండుగా కనిపిస్తున్నాయి. దశాబ్దాల తరబడి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చిన చేతిపంపుల విషయంలో అధికారులు పట్టనట్లు వ్యవ హరించడంతో అవి నిరుపయోగంగా మారాయి. సుమారు 40 ఏళ్ల క్రితం వరకు గ్రామాలు, పట్టణాల్లోనూ ప్రభుత్వ పరంగా ప్రజలకు తాగునీటి బోర్లే ప్రధాన నీటి ఒనరులుగా ఉండేవి.

నియోజకవర్గంలో..


యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 1,756 చేతి పంపులున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.


మరమ్మతులకు నోచని చేతి పంపు

యర్రగొండపాలెం మండలంలో 413 చేతి పంపులకు గాను 39 మాత్రమే పని చేస్తున్నాయి. త్రిపురాంతకం మండలంలో 379 చేతి పంపులకు గాను 299 పని చేస్తున్నాయి. పుల్లలచెరువు మండలంలో 369 చేతి పంపులకు గాను 81, పెద్దారవీడు మండలంలో 303 గానూ 31 చేతి పంపులు పని చేస్తున్నాయి. పెద్దదోర్నాల మండలంలో 292 చేతి పంపులకు గాను 21 చేతి పంపులు పని చేస్తున్నాయి. ఇలా మొత్తం 1756 చేతి పంపులకు గాను 471 చేతి పంపులు మాత్రమే ప్రజలకు ఉపయోగపడుతున్నాయి.

నాలుగేళ్లుగా విడిభాగాల సరఫరా లేక..

చేతి పంపుల నిర్వహణకు నియోజకవర్గ స్థాయి బోర్డు మెకానిక్‌లు ఉన్నారు. మండల స్థాయిలో తాత్కాలిక విధానంతో సిబ్బందిని గతంలో ప్రభుత్వం నియమించింది. వారి ద్వారా క్షేత్ర స్థాయిలో నిర్వహణ చేపట్టేవారు. గడచిన నాలుగేళ్లుగా మరమ్మతుల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. వాటికి అవసరమైన పైపులు, కమ్మీలు, ఇతర విడి భాగాల కొనుగోళ్లు, సరఫరా ఆగిపోయింది. సిబ్బంది అందుబాటులో ఉన్నా విడిభాగాలు లేనందున బాగు చేయలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి చేతిపంపుల నిర్వహణకు చర్యలు చేపడితే తాగునీటి ఇబ్బందులకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడుతుంది.


తుప్పుపట్టిన చేతిపంపు

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ముఖ్యమంత్రి చంద్రబాబ ునాయుడు ఈనెల 7న బాపట్లలో పర్యటిస్తారని, అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పి టిపి. విఠలేశ్వర్ కలిసి శనివారం పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సిఎం హాజరయ్యే కార్యక్రమం వేదిక వరకూ కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాల వెనుకవైపు ఉన్న సమీకత గిరిజన సంక్షేమ బాలికల వసతిగహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వసతి గహాన్ని పరిశీలించే అవకాశం ఉందని అధికారులకు తెలిపారు. విద్యార్థినుల వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. వసతి గహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులు ఉండే ప్రతి గదిలోనూ ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గహ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ కోసం పాఠశాల ప్రాంగణాన్ని సిద్ధం చేయాలన్నారు. అనంతరం తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో పాఠశాలలో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో నిర్వహించే చర్చా కార్యక్రమం విద్యార్థులకు ప్రయోజనకరం కలిగే చూడాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ప్రస్తుతం 919 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలన్నారు. డిజిటల్ ఆహ్వానం ప్రత్యేకంగా తయారు చేసి వారి ఫోన్‌లకు పంపాలన్నారు. పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులే యాంకరింగ్ చేపట్టేలా చైతన్య పరచాలన్నారు. పాఠశాలలో మున్సిపాలిటీ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ కవాతు మైదానం నుంచి మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలను గంటల తరబడి నిలిపివేయడం లాంటి చర్యలు తీసుకోరాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా అదనపు ఎస్పి టిపి విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, డిఇఒ పురుషోత్తం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.